క్లుప్తంగా

నరేష్‌కు సేవా భూషణ్ పురస్కారం



సేవా భూషణ్ పురస్కారం అందుకుంటున్న నరేష్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని చవాకుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా సేవా భూషణ్ పురస్కారం అందించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు నరేష్ తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలో సుందరయ్య కళా నిలయంలో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జి.చంద్రయ్య చేతుల మీదుగా సేవా భూషణ్ జాతీయ స్థాయి పురస్కారం అందించారన్నారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించిన సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో పలువురు నరేష్‌కు అభినందనలు తెలిపారు.

వృద్ధురాలికి వసుధ ఆర్థిక సాయం



వృద్ధురాలికి చెక్కును అందిస్తున్న బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: నరసాపురం పట్టణానికి చెందిన వృద్ధురాలు పాలపర్తి వెంకట నరసమ్మ షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఈమె కుడికాలు మోకాలిపై వరకు తీసి వేశారు. కృత్రియ కాలు పెట్టుకోవడానికి వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజును సంప్రదించగా ఆయన స్పందించి రూ.10 వేలు చెక్కు పంపించారు. ఈ చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, అల్లూరి వెంకట సూర్య నారాయణరాజు (పండురాజు) వెంకట నరసమ్మకు సోమవారం అందజేశారు. తనకు ఆర్థిక సాయం చేసిన ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట్రామరాజుకు వెంకట నరసమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

టీవీ టెక్నీషియన్లు అప్‌డేట్ అవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మానెం బసవరాజు

పాలకొల్లు సెంట్రల్: టీవీ టెక్నీషియన్లు నూతన టెక్నాలజీపై అప్‌డేట్ అవ్వకపోతే ఇక ముందు మనుగడ ఉండదని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మానెం బసవరాజు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆడియో అండ్ వీడియో, టీవీ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ ప్రభుత్వం టీవీ టెక్నీషియన్లకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా తమ వృత్తిలో మరింత అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించాలన్నారు. లేదంటే నేటి తరంలో వస్తున్న టెక్నాలజీని అందుకోలేక మనుగడనే కోల్పోతామన్నారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు సీహెచ్ సూర్యనారాయణ, బొడ్డపాటి సూరిపండు, ఎన్.వెంకటరత్నం, యు.అప్పాజి, నల్లా శివకుమార్, జంత్రశేఖర్, గుబ్బల శ్రీనివాస్‌లను సత్కరించారు. కార్యక్రమంలో గుద్దటి కేధారేశ్వరుడు, వట్టి శ్రీనివాస్, బత్తుల నాగేశ్వరరావు, సానబోయిన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు 'ఏఎస్‌ఎన్‌ఎం' విద్యార్థిని ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో హెప్టాథ్లాన్ ఈవెంట్ నందు తమ కళాశాల విద్యార్థిని కె.విజయలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. నన్నయ్య యూనివర్శిటీలో డిసెంబర్ 13, 14 తేదీల్లో అథ్లెటిక్స్ నిర్వహించారన్నారు. రాజరాజేశ్వరి మాట్లాడుతూ తమ కళాశాల నుంచి పాల్గొన్న బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని విజయలక్ష్మి పోటీల్లో గెలిచిందని తెలిపారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను వినియోగించుకోండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీపార్వతి

మొగల్తూరు: పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కె.లక్ష్మీపార్వతి కోరారు. మొగల్తూరు పంచాయతీ కోట ప్రాంతంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 43 మంది రోగులను పరీక్షించారు. మెడికల్ ఆఫీ సర్ విరాజిత, సీహెచ్‌వో కె.సాంబశివరావు, ఎంపీహెచ్ఏ రమేష్ పాల్గొన్నారు.

● జైన దేవాలయంలో ప్రత్యేక పూజలు



జైన దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆచంటలోని శ్రీ పద్మప్రభు శ్వేతాంబర్ జైన దేవాలయంలో ఆలయ పదవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. జైన గురువుల ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కోరుతూ భక్తులు జైన దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా 500 మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాజింగ కుమార్‌జైన్, జయంతిలాల్, అంబాలాల్, అశోక్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహణ ఏర్పాట్లు చేశారు. –పెనుగొండ

● శివాలయంలో ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీశివదేవస్వామి



ప్రత్యేక అలంకరణలో శ్రీపార్వతీ అమ్మవారు

ప్రముఖ వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలో శ్రీపార్వతీ సమేత శ్రీశివదేవస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీశివదేవస్వామికి అభిషేకాలు, శ్రీపార్వతికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సంతాన యోగం కోసం ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. అర్చకస్వాములు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి శివాజీ భక్తులకు సేవలందించారు. –పాలకొల్లు అర్బన్

● ఘనంగా ఆరుద్రోత్సవం



శివయ్యకు అభిషేకం చేస్తున్న అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి

మార్గశిర మాసంలో ఆరుద్ర నక్షత్రం శివ నక్షత్రం కావడం అది సోమవారం రావడంతో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే శివాలయాల్లో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. మార్గశిర ఆరుద్ర నక్షత్రం రోజున సూర్యోదయానికి ముందు శివాభిషేకం, శివ దర్శనం, పూజ అత్యంత పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం. మార్గశిర ఆరుద్ర నక్షత్రంలో శివుడు స్తంభాకారం ధరించి మాఘమాసం కృష్ణ చతుర్దశి (శివరాత్రి) రోజున అగ్ని స్తంభ రూపానికి మారతాడని ఇతిహాసం. కనుకనే శివరాత్రికి ఎంత ప్రాముఖ్యం ఉంటుందో మార్గశిర ఆరుద్ర నక్షత్రానికి అంతే ప్రాముఖ్యం ఉంటుంది. –యలమంచిలి

రుద్రభూమి కష్టాలు.. రుద్రుడికే ఎరుక

● శ్మశాన వాటికలో సమస్యలతో ప్రజల ఇక్కట్లు
● వర్షం వస్తే కాష్టం కాలడమూ కష్టమే!



వర్షంలో మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న స్థానికులు (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: వీడి చావు మన చావుకొచ్చిందే మిటిరా బాబూ.. ఇదీ సహజంగా మృతి చెందిన వ్యక్తికి దహన సంస్కారాలు చేయడానికి అతని వెంట శ్మశానం వరకూ వెళ్లే బంధువులు, స్నేహితులకు ఇబ్బందులు ఎదురైతే మాట్లాడుకునే మాటలు. ప్రస్తుతం పాలకొల్లు మండలంలోని వరిధనం గ్రామంలో రుద్రభూమిలో సమస్యలు ఆ రుద్రుడికే ఎరుక అంటూ ఆ గ్రామ ప్రజల మనోగతం వినిపిస్తున్నారు. శ్మశానంలో ఒక షెడ్డూ లేదు, క్రిమీలేషన్ బెడ్లూ లేవు వర్షం వస్తే కార్యక్రమం నిర్వహించే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ వర్షానికి మృతదేహాన్ని కాల్చడం చాలా కష్టమవుతుంది. ఎండు ఆకులు, పుల్లలు వేసి కాలుస్తున్నారు. వర్షం వస్తే అవి అంటుకోవడం లేదు. దీంతో డీజిల్ వేయవలసి ఉంటుంది. వర్షంలో డీజిల్ ఖర్చు ఎక్కువ అవుతుంది. డీజిల్ వేసినప్పుడు మాత్రమే మంట వస్తుంది. మంట తగ్గిందో వర్షానికి ఆరిపోతుంది. ఇలా వర్షంలో తడుస్తూ కాష్టం కాలే వరకూ మంట వద్దే ఉండవలసి వస్తుంది. ఇదిలా ఉంటే శ్మశానానికి వెళ్లిన వారు కార్యక్రమం ముగించుకుని స్నానం చేయాల్సి ఉంటుంది. స్నానానికి ఎలా ఉన్నా కర్మకాండలు చేసే ముందు కుండతో నీళ్లు పట్టుకుని కార్యక్రమం చేయవలసి ఉంటుంది. ఆ నీళ్లు కూడా ఇంటి వద్ద నుంచే తీసుకెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రభూమి స్థలం దాదాపుగా ఎకరం వరకూ ఉంటుంది. మధ్యలో రోడ్డు వెళ్లడం వలన శ్మశానం రెండు వైపులా చీలిపోయింది. ప్రస్తుతం అక్కడ ఉన్న షెడ్డు ఎందుకూ పనికి రావడం లేదు. చెత్త మొక్కలతో చాలా అధ్వానంగా మారింది. వర్షం వస్తే శ్మశానంలో అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. స్థలం ఉన్నా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కర్మకాండలకు నీళ్లు కూడా లేవు



శ్మశానంలో కర్మకాండలు చేయడానికి కనీసం నీళ్లు కూడా ఉండడం లేదు. ఇంటి నుంచి టిన్నులతో నీళ్లు తెచ్చుకోవలసి వస్తుంది. స్నానం చేయడానికి ట్యాంకును ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కూర్చోవడానికి షెడ్ కూడా లేదు. వర్షం వస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ఇక్కడ వసతులు కల్పించాలి.

కడలి గంగాధరరావు, వరిదనం గ్రామస్తుడు

వర్షం వస్తే నిలువనీడ లేదు



వర్షం వస్తే కర్మకాండలు చేయడం చాలా కష్టంగా ఉంటుంది. కర్మకాండలు చేయడానికి షెడ్ ఏర్పాటు చేసి ఓ రెండు క్రిమిలేషన్ బెడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నీళ్ల కోసం కనీసం ఓ బోరు అయినా ఏర్పాటు చేయాలి. అస్థికలు భద్ర పరుచుకోవడానికి ఓ రూము కూడా అవసరం ఉంది.

మాదిరెడ్డి నాగబాబు, వరిదనం గ్రామస్తుడు

నూరుశాతం పన్ను వసూలు సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం: మునిసిపాలిటీలో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. సోమవారం కమిషనర్ పన్నుల వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరం వచ్చే లోపు పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, మంచినీటి పన్నులు వసూలు చేయాలన్నారు.సమావేశంలో ఆర్ఐ నానాజీ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

మొగల్తూరు: ఏ విధమైన రసాయనాలు వేయకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయల పెంపకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ కె.రాజకిశోర్‌తో పాటు ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, తదితర అధికారులు కూరగాయలను కొనుగోలు చేశారు.

యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బ్రాడీపేట నాలుగో వీధిలో నివాసం ఉంటున్న కేజీవీ దుర్గాప్రసాద్ (21) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అతడి కుటుంబ సభ్యులు సోమవారం విజయవాడ వెళ్లగా ఇంటిలో ఒంటరిగా ఉన్నాడు. సాయంత్రం ప్రసాద్ మిత్రులు ఇంటికి వచ్చి తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగలగొట్టగా ఇంటిలో ప్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు కుటుంబానికి భారంగా ఉన్నానని తరచూ అంటూ ఉండేవాడని తల్లి దుర్గాదేవి తెలిపింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.పృధ్వీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని లాకుల వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన వివరాలివీ.. పాలకొల్లు వైపు వెళుతున్న కారు, ఏనుగువానిలంక వెళుతున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఏనుగువానిలంకకు చెందిన పెదపాటి లక్ష్మీకుమారి, పాలపర్తి భాస్కరరావు గాయపడటంతో నరసాపురం ఏరియా ఆసుపత్రి లో చేర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

నేడు నీటి సంఘాల చైర్మన్ల ఎన్నిక

పెనుగొండ: సిద్ధాంతం నీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మంగళవారం లాకుల వద్ద నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నీటి సంఘం ఎన్నికలకు ఇప్పటికే సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తైంది. సిద్ధాంతం నీటి సంఘం ఎన్నికకు సంబంధించి ఆచంట నుంచి నలుగురు, సిద్ధాంతం నుంచి ఒకరు, యలమంచిలి నుంచి ముగ్గురు మొత్తం ఎనిమిది మంది నీటి సంఘాల అధ్యక్షులు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎన్నిక ప్రక్రియ జరుగనున్నట్లు ఎన్నికల అధికారి డి.పిచ్చియ్య తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలి



కార్యక్రమంలో ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో దాసి రాజు



మొగల్తూరు: ఫిర్యాదు అందజేస్తున్న శేరేపాలెం గ్రామస్తుడు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంతో దూరం నుంచి వచ్చి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరులో నాలుగు ఫిర్యాదులు

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ కె.రాజ కిశోర్ తెలిపారు. మొగల్తూరు మండలంలోని శేరేపాలెం గ్రామానికి చెందిన కత్తుల కృష్ణారావు తన ఇంటి వద్ద నుంచి పొలం వెళ్లే రహదారిని మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు అందజేశాడన్నారు. తమ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు అందించాలని ఇద్దరు, వివాదంలో ఉన్న తమ స్థల సమస్యను పరిష్కరించాలని మరొకరు ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రిశూల పాణి, డీటీ సంధ్య, పీఆర్ ఏఈఈ ఎ.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, ఏవో అబ్దుల్ రహీమ్, వివిధ శాఖల అధికారులు, వసతి గృహాల వార్డెన్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి



ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నరసాపురం: జర్నలిస్టులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టాలని ఏపీయూడబ్ల్యూజే నరసాపురం శాఖ డిమాండ్ చేసింది. కడప జిల్లా వేముల సాక్షి రిపోర్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో దాసి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నరసాపురం నియోజకవర్గ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తరపట్ల ఇజ్రాయిల్, నాయుడు, మారుతీరావు మాట్లాడుతూ నీటి సంఘం ఎన్నికల వార్తల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి విలేకరిపై కొందరు దాడి చేయడం దారుణమన్నారు. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీవీ9 మీడియా ప్రతినిధిని సినీనటుడు మోహన్ బాబు హైదరాబాద్‌లో విచక్షణారహితంగా కొట్టడం క్షమించరానిదన్నారు. జర్నలిస్టులపై ఇటీవల దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. జర్నలిస్టులపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు అమల్లోకి తేవాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు చేరుగొండి వెంకటేశ్వరరావు, సందీప్, రాజేష్, జీవన్, కుమార్, శ్రీనివాస్, పండు, నాని, రమేష్ పాల్గొన్నారు.

నరకానికి రహదారులు



అధ్వానంగా ఉన్న కాళీపట్నం-భీమవరం రహదారి



కాళీపట్నం పడమర సెంటర్ నుంచి కృష్ణా జిల్లా చినగొల్లపాలెం వెళ్లే రహదారి దుస్థితి ఇలా



గోతుల మయమైన జగన్నాథపురం రహదారి

మొగల్తూరు: మండలంలోని ఏ రోడ్డు చూసినా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గోతులు, గొప్పులతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారులపై కనీసం గోతులను పూడ్చే కార్యక్రమం అయినా చేపట్టకపోవడంపై గ్రామస్తులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన మొగల్తూరులో గొల్లగూడెం, స్టేషన్ రోడ్డు, మొగల్తూరు-వెంపవయా కొత్తపాలెం రోడ్లు, కాళీపట్నం నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారి, కాళీపట్నం పడమర సెంటర్ నుంచి కృష్ణాజిల్లా చినగొల్లపాలెం వంతెన రోడ్డు, జగన్నాథపురం ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారులు పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

యలమంచిలి: భూ సమస్యల పరిష్కారానికి రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ కోరారు. మీ భూమి మీ హక్కు నినాదంతో సోమవారం ఉదయం కనకాయలంక, మధ్యాహ్నం పెదలంక గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కనకాయలంకలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఎనిమిది, సీ క్లాస్ భూములకు పట్టాల కోసం రెండు, దారిమార్గం కోసం ఒకటి 11 దరఖాస్తులు వచ్చాయి. పెదలంకలో పట్టాదారు పాస్ పుస్తకం కోసం తొమ్మిది, రీప్లేస్‌మెంట్ పాసుబుక్కు కోసం ఒకటి, అడంగల్ కరెక్షన్ కోసం రెండు, సీ క్లాస్ పట్టాలకు రెండు, ఇంటి స్థల పట్టా ఇవ్వమని ఒకటి మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కనకాయలంక, పెదలంక గ్రామ సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు, ఆర్‌ఐ యశోద, వీఆర్వోలు ఘనలక్ష్మి, నాగరాజు, శ్రీను గ్రామ సర్వేయర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

పెనుగొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. కోడేరులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలపై పలువురు రైతులు అధికారులకు వినతులు అందజేశారు. ఆచంట తహసీల్దార్ జి.కనకరాజు, సబ్‌రిజిస్ట్రార్ కె.వెంకటపతిరాజు, డీటీ పద్మావతి, ఆర్‌ఐ లక్ష్మి, కడలి నాగమునీంద్రరావు, పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజ కిశోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులకు సంబంధించి భూ సమస్యలు ఏమైనా ఉంటే లిఖిత పూర్వకంగా తమకు తెలియజేస్తే వాటిని పరిశీలించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

గుమ్మలూరులో..

పెనుగొండ: పోడూరు మండలం గుమ్మలూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఒక ప్రకటనలో తెలిపారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూకు సంబంధించిన ఇతర సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

వరిధనం, పెదమామిడిపల్లిలో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని వరిధనం గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అలాగే పెదమామిడిపల్లిలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పాల్గొని తమ సమస్యలను లిఖితపూర్వకంగా రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీలు సమర్పించాలని కోరారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (ఆచంట)
90102 01609 (నరసాపురం)
95055 07552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com